క్లుప్తంగా

'రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణ'



మాట్లాడుతున్న మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షుడు అప్పారావు

దేవరాపల్లి : రాష్ట్రంలో ఉమ్మడి రిజర్వేషన్లతో ఐక్యంగా ఉన్న ఎస్సీలను, వర్గీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు విమర్శించారు. దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద శనివారం మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేశారు. అప్పారావు మాట్లాడుతూ దళిత కాలనీల అభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, భూమి కొనుగోలు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సంఘం గౌరవ అధ్యక్షుడు కార్లి సాయి సుందరరావు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం, సమన్వయకర్త మాలిబాబు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



ఎ.కోడూరు హైస్కూల్లో హెచ్‌ఎంకు జాయినింగ్ రిపోర్ట్‌ను అందిస్తున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు : ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో బాగంగా ఎ.కోడూరు హైస్కూల్‌కు బదిలీ అయిన ముగ్గురు ఉపాధ్యాయులు శనివారం విధుల్లో చేరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శేఖర్‌కు వీరు జాయినింగ్ రిపోర్టులను అందించారు. పాఠశాలలో చేరిన వారిలో పీడీ–1గా నాతవరం మండలం డి.యర్రవరం పాఠశాల నుండి చిట్టి ప్రసాద్, పీడీ–2గా దేవరాపల్లి మండలం వేచలం నుంచి తమ్మునాయుడు, హిందీ ఉపాధ్యాయునిగా దేవరాపల్లి మండలం రైవాడ నుంచి చంద్రకళ వచ్చారు. కార్యక్రమంలో పీఎంసీ కమిటీ చైర్మన్ కిల్లి సింహాచలంనాయుడు, ఉపాధ్యాయులు ప్రసాద్, బంగారునాయుడు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

నర్సీపట్నం : ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్‌లో సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎస్.వి.ఎస్.సుధా శారద మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు, గర్భిణులు కాన్పు సమయంలో ఆపరేషన్ అవసరమైనప్పుడు రక్తం చాలా అవసరమన్నారు. దాతలు ముందుకువచ్చి రక్తదానం చేయడం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి బ్లడ్ కోసం వచ్చే రోగులకు రక్తం కొరత ఉండదన్నారు. అనంతరం రక్తదాన అవశ్యకతపై ఏరియా ఆస్పత్రి నుంచి అబిద్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

విద్యతోనే వర్గీకరణ ఫలాలు అందిపుచ్చుకోవాలి



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు

రావికమతం : ఎస్సీ వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ ఏన్నో ఏళ్ల పోరాటం చేసింది.. సుప్రీంకోర్టు ఆదేశాలతో వర్గీకరణ జరిగింది. పోరాటాల ద్వారా సాధించుకున్న వర్గీకరణ ఫలాలు పొందాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అనకాపల్లి జిల్లా ఎంఆర్‌పీఎస్ ఇన్‌చార్జ్ పోసుపల్లి వెంకట్రావు సూచించారు. రావికమతం మండలం జెడ్.కొత్తపట్నంలో ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ , ఎంఎస్‌పి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం రాత్రి జరిగింది. జులై 7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా జరిపించాలని నిర్ణయించారు. మాదిగ ఉద్యోగుల అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కండెల్లి వెంకట్రావు మాదిగ సామాజికవర్గ ఉద్యోగుల సమాచారాన్ని తెలియజేస్తే ఎవరికి ఏ సహకారం కావాలన్నా ఉద్యోగ సంఘం నుంచి సహకారం అందిస్తామని చెప్పారు. ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

ఏరువాక...సాగేనా సజావుగా..!

- ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధం
- ఈ ఏడాది 12 వేలకు పైగా ఎకరాల్లో ఖరీఫ్ వరి లక్ష్యం
- విత్తనాల కోసం నమోదు
- వర్షాధార ప్రాంతంలో రబీ వరి కోతలు పూర్తి
- పుష్కలంగా జలాశయాల్లో చేరిన నీరు
- పెట్టుబడి సాయం అందక అప్పులతో రైతుల తిప్పలు



ఖరీఫ్ వరినారు వేయడానికి దుక్కు చేసిన మడి



జె.డి.పేటలో కోసిన రబీ వరి పంట

మాడుగుల రూరల్ : మృగశిర కార్తె ప్రారంభం కావడంతో ఆడపా దడపా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ఖరీఫ్ వరినారు వేయడానికి రైతులు నారు మడులు సిద్ధం చేస్తున్నారు. వరి విత్తనాల కోసం గ్రామ సచివాలయాల పరిధిలో గల రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుంటున్నారు. అడపాదడపా కురిసే వర్షాలకు పలు గ్రామాల్లో కూరగాయలు బాగా పండాయి. వంగ, బీర, బెండ, ఆకు కూరలు పంటలు ఇప్పటికే వేశారు. అలాగే మెట్ట భూముల్లో అపరాలు పంటలకు సైతం వర్షాలు ఎంతో మేలు చేసాయి.

విత్తనాల కోసం ఎదురుచూపులు

మండలంలో గత ఏడాది 10,500 ఎకరాల్లో ఖరీఫ్ వరి పండించారు. ఈ ఏడాది సుమారు 12,500 ఎకరాల్లో వరి విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి అనుగుణంగా రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు కోసం నమోదు ప్రారంభించారు. అయితే గడిచిన రబీ సీజన్‌లో నీటి ఆధారం వున్న పంట భూముల్లో రబీ వరి పంట వేశారు. అయితే ఆకాల వర్షాల వల్ల కొన్ని చోట్ల కోసిన వరి పంట తడిసిపోయి కొంత నష్టం వాటిల్లింది.

జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు..

వర్షాలకు జలాశయాల్లో నీరు పుష్కలంగా చేరింది. గత నెలల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదు అయింది. ఈ నెలలో కూడా వర్షపాతం ఎక్కువగా నమోదు అవుతుంది. ఇప్పటికే రాచకట్టు ఆయకట్టు ప్రాంతంలో వరి విత్తనాలు ఎదజల్లే పనిలో వున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ల ద్వారా వరి నారు మడులు దున్నిస్తున్నారు.

అన్నదాత సుఖీభవ ఏదీ...

ఈ ఏడాది ప్రభుత్వం నుంచి అందించే రైతు భరోసా అందలేదు. దీంతో రైతులు ప్రస్తుతం అప్పులు చేసి, పంటలకు పెట్టుబడి పెడుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం తన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో క్రమం తప్పకుండా ఈ ఆర్థిక సహాయం రైతుల ఖాతాలకే వేశారు. ఈ ప్రభుత్వ హయాంలో ఆర్థిక సాయం అందక రైతులు అప్పులతో వ్యవసాయం చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందించాలి



ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే రూ.20వేలు ఆర్థిక సహాయం ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలకు వేయాలి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా వరి విత్తనాల కోసం నమోదు పూర్తి చేసి పూర్తి స్థాయిలో విత్తనాలు అందించాలి. సబ్సిడీ మీద కూరగాయల విత్తనాలు కూడా అందించాలి.

–బి.జగ్గప్పారావు, రైతు, కె.జె.పురం, మాడుగుల మండలం

సాగునీటి కాలువలు నిర్మించాలి



సాగునీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌కు సాగునీటి కాలువల్లో జంగిల్ తొలగించి, పూడికతీత చేపట్టాలి. దీని ద్వారా ప్రతి చివరి ఆయకట్టు భూమికి సాగునీరు అందుతుంది. ఉపాధి హామీ పథకం అధికారులు చర్యలు తీసుకోవాలి.

–పోతుబంతి రాజుబాబు, రైతు, ఎం.కోటపాడు, మాడుగుల మండలం



తాచేరు నదిలో చేరిన వర్షపు నీరు



వర్షాలకు కె.జె.పురంలో ఏపుగా పెరిగిన బెండ తోట



పెద్దేరు జలాశయంలో చేరిన నీరు

బీసీ సెల్ అధ్యక్షుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



శ్రీనును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఇటంశెట్టి శ్రీనును మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి గాయాలవ్వడంతో ఇంటివద్దే ఉంటున్న శ్రీనును శనివారం ఉమాశంకర్‌గణేష్ పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పిల్లా శ్రీను, గొలుగొండ మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు కొరుప్రోలు పాణి, శాంతారాం, మాకిరెడ్డి అయ్యప్ప, సత్తిబాబు తదితరులు ఉన్నారు.

16న విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట : మండలంలో 33/11 కేవీ రోలుగుంట సబ్‌స్టేషన్ పరిధిలో గల ఓలం జీడిపిక్కల కర్మాగారం, కొండపపాలెం, కొమరవోలు, ఎల్.కొత్తూరు. పాడాలపాలెం గ్రామాల్లో ఈ నెల 16 న ఉదయం, 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నర్సీపట్నం విద్యుత్ ఈఈ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైను మరమ్మతుల దృష్ట్యా ఈ అంతరాయం ఉంటుదన్నారు.

19న మరిడిమాంబ జాతర

మాడుగుల : ఈ నెల 19వ తేదీన మరిడిమాంబ జాతర జరగనుందని, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 15న చాటింపు 17 వ తేదీన అమ్మవారి కొలువు, 19న పండగ జరగనుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొత్తకోట వారపు సంత మార్పు



మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్న వారపు సంత

రావికమతం : ట్రాఫిక్‌కు ఇబ్బందుల కారణంగా కొత్తకోటలో శనివారం జరిగే వారపుసంతను సాయిబాబా ఆలయం వెనుక ఉన్న మార్కెట్ యార్డ్‌లోకి మార్చామని సర్పంచ్ కోన లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, పంచాయతీ ఈవో జ్యోతి రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులుశీలం శంకర్, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. శనివారం ఇక్కడ జరిగే వారపు సంతకు చుట్టుపక్కల గ్రామాలైన చీమలపాడు పంచాయతీ శివారు గిరిజన గ్రామాల ప్రజలు, కన్నంపేట, వమ్మవరం గ్రామాల నుంచి వచ్చి వారానికి సరిపడా సరుకులు, కూరగాయల కొనుగోలు చేస్తారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సత్యదేవా, సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, శీలం శంకర్, ఎంపీటీసీ సభ్యుడు గున్నాజీ తదితరులు నాబార్డు నిధులు రూ.17 లక్షలతో మార్కెట్ యార్డ్ నిర్మించారు. యార్డ్‌లో మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సంతను గతంలో మార్కెట్ యార్డ్‌కు తరలించారు.. కానీ వ్యాపారులు రోడ్డుపైనే లావాదేవీలు చేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో శనివారం వారపు సంతను మార్కెట్ యార్డుకు తరలించారు.

పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి



మృతి చెందిన పాడి ఆవుల వద్ద రోదిస్తున్న రైతు కళ్యాణం

చీడికాడ: మాడుగుల నుంచి ఖండివరం రహదారిలో మోసూరి వారి కళ్లాలు వద్ద గల జనపరెడ్డి కళ్యాణంకు చెందిన పాడి ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన కళ్యాణం పశువులను మేతకు వదలగా శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడి రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. బాధిత రైతుకు ఈ పాడి ఆవులే ఆధారం. వీటి ఖరీదు సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని తెలిపారు. బాధిత రైతును చోడవరం సీడీసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు గెంజి స్వాతి, బాలాజీ, చీడికాడ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.

గంజాయికి దూరంగా ఉండండి



పల్లావూరు నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ : ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడచి సమాజానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, కృష్ణదేవిపేట, గొలుగొండ ఎస్ఐలు తారకేశ్వరరావు, రామారావు హితవు పలికారు. పల్లావూరు నుంచి పాత కృష్ణదేవిపేట వరకు శనివారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ గంజాయి వల్ల అనేక అనర్థాలు వస్తున్నాయన్నారు. గంజాయి రవాణా, అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేయడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గంజాయి కేసుల్లో ఉన్న వారి ఆస్తులు సైతం కోర్టులు జప్తు చేస్తున్నట్టు చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

భయపెడుతున్న భారీ వృక్షం

చెట్టు కూలితే నర్సీపట్నం–తుని మధ్య రాకపోకలు బంద్



రోడ్డుపై కూలేందుకు సిద్ధంగా ఉన్న భారీ వృక్షం

నాతవరం : నర్సీపట్నం– తుని ఆర్‌అండ్‌బీ రోడ్డులో భారీ వృక్షం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నాతవరం, నర్సీపట్నం మండలాల సరిహద్దులో ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో భారీ వృక్షం చాలా కాలంగా వాలిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఇటీవల వీచిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు మరింతగా రోడ్డుపైకి వాలిపోయింది. ఈ భారీ వృక్షం కూలిపోతే నర్సీపట్నం–తుని మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ రోడ్డులో నిత్యం రాత్రి పగలనక తేడా లేకుండా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తుని రైల్వే స్టేషన్‌కు విజయవాడ,అమరావతికి వెళ్లడానికి నర్సీపట్నం, గొలుగొండ రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం, నాతవరం మండలాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల ప్రజలంతా ఈ రోడ్డులోనే ప్రయాణిస్తుంటారు. భారీ వృక్షం రోడ్డుపైకి వాలిపోవడంతో భారీ వాహనాలకు రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రమాదాన్ని తలపించే భారీ వృక్షాన్ని తొలగించాలని ఈ ప్రాంత వాహనదారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం

బుచ్చెయ్యపేట : వడ్డాది హైస్కూల్లో 2012–13 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆయన తోటి విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. వడ్డాది హైస్కూల్లో 2012–13 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలియక గత నెలలో ఈ పాఠశాలలో జరిగింది. వీరితో చదువుకున్న ముచింగ్‌పుట్ మండలానికి చెందిన గోల్లోరి సుకుదేవ్ వడ్డాది ఎస్సీ వసతి గృహంలో ఉంటూ ఈ పాఠశాలలో చదువుకునేవారు. సుకుదేవ్ మూడు సంవత్సరాల క్రితం మృతి చెందిన విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ముచింగ్‌పుట్ వెళ్లి అతని కుటుంబాన్ని పరామర్శించారు. కొంత నగదు, నిత్యావసర వస్తువులను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం



కె.జె.పురం జంక్షన్‌లో జనవాసాల మధ్య నిల్వ వున్న నీరు



దేవరాపల్లి పోలీస్‌స్టేషన్ రోడ్డులో విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు

మాడుగుల రూరల్ : ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం శనివారం మధ్యాహ్నం కురిసింది. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సుమారు గంటసేపు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కె.జె.పురం జంక్షన్ వద్ద డ్రైనేజ్‌లు లేకపోవడం వల్ల వర్షపు నీరు రోడ్లపై చేరి నిల్వ వుండిపోయింది.

మాడుగుల : మండలంలో సత్యవరం, జంపెన, జాలంపల్లి, అవురువాడ, ఎం.కోడూరు, సాగరం, మాడుగుల, కేజేపురం వొమ్మలి, జేడీపేట, కింతలి, డి.గొలివాడ గ్రామాల్లో శనివారం సాయంకాలం ఈదురుగాలులలో కూడిన వర్షం కురిసింది.

అర్ధరాత్రి కుండపోత వర్షం

గొలుగొండ : మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. గడిచిన 15 రోజులు నుంచి చుక్క వర్షం లేని సందర్భంగా భారీ వర్షం కారణంగా వాతావరణం అంతా పూర్తిగా చల్లబడింది. గత నెల 30 తేదీ నుంచి మండలంలో ఎక్కడా వర్షం కురవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఆర్ధరాత్రి మండలంలో ప్రతి గ్రామంలో భారీ వర్షం కురవడంతో పంట పొలాలు సైతం నీటితో నిండిపోయాయి.

ఈదురుగాలులకు కూలిన చెట్లు

దేవరాపల్లి: మండల కేంద్రంలో ఈదురుగాలు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమై జనజీవనం స్తంభించిపోయింది. ఈదురు గాలుల ధాటికి పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగి పడి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే విరిగిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించారు. పలుచోట్లు విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా సిబ్బంది తక్షణమే చర్యలు చేపట్టి పునరుదర్ధరించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

మాకవరపాలెం: వేంకటేశ్వరస్వామి నగర సంకీర్తన వైభవంగా నిర్వహించారు. మండలంలోని తామరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండు నుంచి తామరం ఆలయం వరకు భక్తులు నగర సంకీర్తన చేశారు. శ్రీవారి చిత్రపటాలతో భక్తి గీతాలు ఆలపిస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, ఉల్లాసం



మాకవరపాలెంలో యోగా చేస్తున్న ఎంపీపీ, అధికారులు



యోగాంధ్ర కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు



అవురువాడ అంగన్‌వాడీ కేంద్రంలో యోగాసనాల శిక్షణ



మామిడిపల్లిలో యోగా సాధన చేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం

నాతవరం : ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటారని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలతో యోగసనాలు వేశారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పార్థసారథిపాల్గొన్నారు.

మాడుగుల : మండలంలో 23 సచివాలయాల్లో శనివారం ఉదయం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగాసనాలు వేయించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి, అంగన్వాడీ కేంద్రాల్లో సీడీపీవో శ్రీదేవి చిన్నారులతో యోగా నిర్వహించారు.

మాకవరపాలెం: యోగా చేయడం ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో చాయాసుధ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల వ్యాప్తంగా సచివాలయాల్లో శనివారం ఉదయం 6 నుండి 9 గంటల వరకూ యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చౌడువాడ సచివాలయం వద్ద యోగా శిక్షణలో తహసీల్దార్ రమేష్‌బాబు, కె.కోటపాడు హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలో అన్ని గ్రామాల్లోను ఎంపీడీవో నాగేశ్వరరావు పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అడ్డసరం మహిళా సంరక్షణ కార్యదర్శి లక్ష్మీదేవి యోగాసనాలు వేసి అందరితోను ఆసనాలు వేయించారు.

మాడుగుల రూరల్: మండలంలో 23 గ్రామ సచివాలయాలల్లో శనివారం ఉదయం ప్రజలు భాగస్వామ్యంతో యోగసనాలు వేయించారు. తహసీల్దారు కె. రమాదేవి, ఎంపీడీవో కె. అప్పారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: యోగా సాధనతో మానసిక ప్రశాంతత పొందవచ్చునని దేవరాపల్లి జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం అన్నారు. మామిడిపల్లి సచివాలయం పరిధిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం యోగా సాధనను నిర్వహించారు.



చౌడువాడలో యోగాసనాల కార్యక్రమం



అడ్డసరంలో యోగా చేస్తున్న పలు శాఖల ఉద్యోగులు



కె.జె.పురం 2 సచివాలయంలో యోగా కార్యక్రమం